ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 9 ఆగస్టు 2025

13న దివ్యాంగుల బహిరంగ సభ

అంతర్గాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఈ నెల 13న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో తలపెట్టిన బహిరంగ సభకు దివ్యాంగులు పెద్ద ఎత్తున తరలిరావాలని అంబేద్కర్ సంఘం రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కుక్క గంగాప్రసాద్ అన్నారు. శుక్రవారం రామగుండం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్, శంకర్, రామస్వామి, తిరుపతి, మల్లేష్, మహేష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ప్రక్షాళన షురూ

- డీఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సరెండర్
- కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం

కోల్‌సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పాలన వ్యవహారాల్లో ప్రక్షాళన మొదలైంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఈ హనుమంతరావునాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌లను శుక్రవారం ప్రభుత్వానికి సరెండర్ చేశారు. జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన మొబైల్ అప్లికేషన్‌లో సకాలంలో డాటా అప్‌లోడ్ చేయడంలో పర్యవేక్షణలోపం, టీయూఎఫ్ఐడీసీ, ఇతర పథకాలలో భాగంగా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయించడంలో అలసత్వం వహించినందుకు డీఈ హనుమంతరావునాయక్‌ను సరెండర్ చేశామని, ఆయన స్థానంలో మరొక డీఈని నియమించాల్సిందిగా ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీని కోరినట్టు ఆమె తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీ కిరణ్ కుమార్ తనకు కేటాయించిన డివిజన్‌లో పారిశుధ్య పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడని తెలిపారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని కోరారు.



రైతు బీమా కొనసాగేనా..

- ఈ నెల 14వ తేదీతో ముగియనున్న గడువు
- ఇప్పటి వరకు రెన్యువల్ ఊసెత్తని ప్రభుత్వం
- అవకాశం కోసం కొత్త రైతుల ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకవచ్చిన రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం తిరిగి రెన్యువల్ చేయడం, కొత్త రైతులకు అవకాశం కల్పించే విషయమై ఇప్పటి వరకు ఊసెత్తక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని కొనసాగిస్తారా, లేదా అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని తీసుక వచ్చింది. పట్టాలు కలిగిన రైతులందరికీ ఎకరానికి 4 వేల చొప్పున, ఆ తర్వాత 5 వేల రూపాయల చొప్పున ఇచ్చింది. అదే సమయంలో రైతుల కోసం రైతు బీమా పథకాన్ని తీసుక వచ్చింది. రైతులు ప్రమాదవశాత్తు మృతి చెందినా, అనారోగ్య కారణాల వల్ల గానీ, ఇతరత్రా కారణాల వల్ల బలవన్మరణాలకు పాల్పడినా రైతుల కుటుంబాలు బజారున పడకుండా ఉండేందుకు రైతు బీమా పథకాన్ని తీసుక వచ్చింది. రైతులు మరణిస్తే 5 లక్షల రూపాయలు ఇచ్చే విధంగా పథకాన్ని రూపొందించారు. భారతీయ బీమా సంస్థ (ఎల్‌ఐసీ)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ పథకం కింద ప్రభుత్వమే నేరుగా వందకు వందశాతం ప్రీమియం డబ్బులను ఎల్‌ఐసీ సంస్థకు నేరుగా చెల్లిస్తున్నది. ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీ నుంచి ఆ తర్వాత ఏడాది ఆగస్టు 14వ తేదీ వరకు అమల్లో ఉంటున్నది. ధరణి పోర్టల్ ఆధారంగా బీమా పథకాన్ని రైతుల పేరిట రెన్యూవల్ చేశారు. ఆ మధ్య కాలంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తూ వస్తున్నది. అలాగే రైతుబంధుకు బదులు రైతు భరోసా పథకాన్ని తీసుక వచ్చి ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున పట్టాదారులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు.

ప్రతి ఏటా రైతు బీమా పథకంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులకు, పాత రైతుల రెన్యూవల్ ప్రక్రియను అంతా ఆగస్టు 5వ తేదీ నాటికి పూర్తి చేస్తారు. కొత్తగా పథకంలో చేరే రైతులు జూన్ 30వ తేదీ వరకు పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతుల నుంచి జూలై 15వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. వారి డేటా మొత్తం మండల వ్యవసాయ శాఖాధికారులకు చేరుతుంది. సదరు రైతుల నుంచి అధికారులు, ఏఈఓలు దరఖాస్తులు తీసుకుని నామిని పేరు, తదితర వివరాలన్నింటినీ రాసి ప్రభుత్వానికి పంపిస్తారు.

2024-25 సంవత్సరానికి పెద్దపల్లి జిల్లాకు చెందిన 1,05,092 మంది రైతులకు రైతు బీమా పథకాన్ని వర్తించే విధంగా ఒక్కో రైతు పేరిట 3,830 రూపాయల చొప్పున 40 కోట్ల 25 లక్షల 2 వేల 360 రూపాయల చొప్పున ప్రభుత్వం ఎల్‌ఐసీ సంస్థకు ప్రీమియం చెల్లించింది. ఈ పథకం ఆరంభమైన నాటి నుంచి జిల్లాలో 376 మంది రైతులు వివిధ కారణాల వల్ల మరణించగా, అన్ని డాక్యు

(మిగతా 8వపేజీలో)

స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ దాసరి వేణు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాటు ఘనంగా చేయాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిశాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు. పోలీస్ శాఖ ప్లాగ్ ఏర్పాటు, గ్రౌండ్ సిద్దం చేయాలని, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. వేడుకల డయాస్, సిట్టింగ్ తదితర అంశాలపై ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ విషయంలో అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వేడుకల వద్ద ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో వైద్య బృందాలను ఏర్పా టు చేయాలని, అవసరం మేరకు తాగునీటి సరఫరా మున్సిపల్ కమి షనర్ ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రొటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలన్నారు. భద్రత విషయంలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ కరు ణాకర్, ఏసీపీ కృష్ణ, ఆర్డీఓ గంగయ్య, ప్రకాష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యం

- ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్



శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అదిస్తున్న మల్లయ్య

పెద్దపల్లి టౌన్, ఆగష్టు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో పెద్దపెల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య కూతురు సింధుకు వైద్యసేవలు అందించారు. గర్భిణి సింధుకు ఆసుపత్రిలో ప్రసవం చేయగా బాబు జన్మించాడు. ఆసుపత్రిలో అన్ని రకాల మెరుగైన వైద్య సేవలు అందించడం పట్ల సూపరింటెండెంట్ శ్రీధర్‌కు నూగిల్ల మల్లయ్య శుక్రవారం పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ పర్యవేక్షణతో వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించి, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే మెరుగైన వైద్య సేవలు పొందాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, నల్లాల సురేష్, మానుపాటి రవి, ఎండి నదీమ్, కీర్తి రాజయ్య పాల్గొన్నారు.

తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు



తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ఎలిగేడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట గ్రామంలో గల 2, 3వ అంగన్‌వాడీ కేంద్రాలు శుక్రవారం తెరుచుకోలేదు. సెలవుదినం లేకున్నా అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉండటంతో అక్కడికి వచ్చిన చిన్నారులు, గర్భిణిలు, బాలింతలు ఇబ్బందులు పడ్డారు. పౌష్టికాహారం అందిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలు పని చేయాల్సి ఉండగా ఇక్కడ విధులు నిర్వహించే టీచర్లు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మధ్యాహ్నం 12.30గంటల తర్వాత కూడా కేంద్రం తాళం తీయక పోవడంతో పలువురువచ్చి వెళ్లిపోయారు. కేంద్రానికి పిల్లలు వచ్చినట్లు నిర్ధారించేందుకు చేపట్టిన ఫేషియల్ రికగ్నిషన్ చేయాల్సి ఉన్నా పిల్లల ఇంటికి ఎఫ్‌ఆర్‌ఎస్ చేసి అధికారులకు పంపి తప్పుడు సమాచారం అందిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయంపై అంగన్‌వాడీ సూపర్ వైజర్ సూర్యకళను వివరణ కోరగా శుక్రవారం సెలవు దినం లేదని ఓటరు జాబితా సవరించమని చెప్పినట్లు ఆమె తెలిపారు.

ఆసుపత్రుల్లో మహిళల భద్రతపై కమిటీ

- ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహిళలు పనిచేసే పని స్థలాల్లో లైగింక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ హెచ్చరించారు. శనివారం ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎవరైనా వేధింపులకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని, మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో ఎవరికైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. 15రోజుల క్రితం నర్సింగ్ సిబ్బందిపై వేధింపులకు గురి చేసినట్టు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని విలేకరులు ప్రశ్నించగా వారు దాటవేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న ఘటనలు తమ దృష్టికి రావడం లేదని కొట్టిపారేశారు. సూపర్‌వైజర్ వ్యవహారంపై ఇక ముందు ఘటనలు జరుగకుండా నలుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు, ఈ కమిటీలో ఆర్ఎంఓ రాజు, పద్మలత, భానులక్ష్మి, అరుణ ఉంటారని, పారిశుధ్య సిబ్బందితో పాటు నర్సులు, విద్యార్థులు ఏమైనా సమస్యలుంటే కమిటీ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నీటిని పారబోస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పరిసరాలు, వార్డులు ఇండ్లు శుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరవని ఎంపీడీఓ పూర్ణ చందర్‌రావు, ఎంపీఓ హరీఫ్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని పెగడపల్లి, పందిల్ల, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ హరీఫ్ హుస్సేన్, గ్రామ కార్యద ర్శులు శంకర్, మహేందర్, ప్రసాద్, ఏఎన్‌ఎం విజయ, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్ల ఆన్‌లైన్‌లో రామగుండం రాష్ట్రంలోనే నెంబర్ వన్

- 30,688 నల్లా కనెక్షన్ల అప్‌లోడ్

కోల్‌సిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నల్లా కనెక్షన్లను ఆన్‌లైన్ చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో 42,160నల్లా కనెక్షన్లు ఉండగా ఇప్పటి వరకు 30,688 కనెక్షన్లు ఆన్‌లైన్ అయ్యాయి. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో 11,472కనెక్షన్లు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా శుక్రవారం నాటికి 8,445కనెక్షన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో త్వరలోనే నల్లా బిల్లులను కూడా ఆన్‌లైన్‌లో చెల్లించే సౌలభ్యం అందుబాటులోకి రానున్నది. ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతో పోల్చితే రామగుండం ముందంజలో ఉన్నది. రామగుండం నగరపాలక సంస్థ 20,660 కనెక్షన్లు ఇవ్వగా అమృత్ పథకంలో 21,500 కనెక్షన్లు ఇచ్చారు. ఇందులో 30,688 కనెక్షన్లు గతంలో ఆన్‌లైన్ చేశారు. వంద రోజుల ప్రణాళికలో 8,445 కనెక్షన్లను ఆన్‌లైన్ చేయగా కేవలం 3,027కనెక్షన్లు మాత్రమే ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. దీంతో ఆస్తిపన్ను వసూలు చేస్తున్న ఇంటర్నెట్ ఆధారిత హ్యాండ్ హోల్డ్ మిషన్‌తోనే నల్లా బిల్లులు కూడా వసూలు చేసేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా స్మార్ట్‌ఫోన్‌తో ఎక్కడి నుంచైనా బిల్లు చెల్లించే వెసు లుబాటు కలుగనున్నది.

11 ఇసుక డంపులు సీజ్

పెద్దపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల అక్రమంగా నిల్వ చేసిన 11 ఇసుక డంపులను సీజ్ చేసి, వారిపై కేసులు పెట్టామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం ప్రాంతంలో 5 ఇసుక డంప్‌లు, మంథని ప్రాంతంలో 3 ఇసుక డంప్‌లు, శ్రీరాంపూర్, రామగిరి, ధర్మారం మండలాల్లో ఒక్కో అక్రమ ఇసుక డంప్ మొత్తం 11 అక్రమ ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశామన్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలోని పాములపేట మేడిపల్లి ఇసుక రీచ్‌లను శాశ్వతంగా మూసి వేస్తున్నామన్నారు.

ఖని మార్కెట్‌లో రాఖీ సందడి

- నేడు రక్షా బంధన్

కోల్‌సిటీటౌన్, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే రక్షాబంధన్ పండు గకు ప్రత్యేకత ఉంది. దీనినే కొన్ని ప్రాంతాలలో జంధ్యాల పౌర్ణమి అని కూడా అంటారు. ఈ పండుగ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. శనివారం జరుపుకోనున్న రాఖీ పండుగకు భారతీయ సనాతన సంప్రదాయంలో ఎంతో ప్రాధాన్యం ఉన్నది. యుగయుగాలుగా, తరతరాలుగా పర్వదినం కొనసాగు తూనే ఉంది. అన్నకు గాని, తమ్ముడికి గాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ లేదా రక్షను కట్టడమే పండుగ అంతర్యం. చెల్లి తన అన్నయ్య మహోన్నత స్థానానికి ఎదగాలని కలకాలం చల్లగా ఉంటూ తనకు రక్షగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ కట్టేదే రాఖీ. అలాగే యజ్ఞోపవీతానికి(జంధ్యానికి) ఉన్న ప్రాధాన్యాన్ని అనుసరించి దీన్నే జంధ్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు. పాతది వదిలి కొత్తదానిని ధరిస్తారు. ఉపన యనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజున గాయత్రీ పూజచేసి కొత్త యజ్ఞపవీతాన్ని ధరించి పాతది తీసివేస్తారు. ఈ రక్షాబంధన్ పర్వదిన వేడుక పురాణాల నుంచి నేటికీ కొనసాగుతూ సంస్కృతి సంప్రదాయాలకు రక్షగా నిలు స్తోంది. రాఖీ పండుగ సందర్భంగా జిల్లాలో దుకా ణాలు కిటకిటలాడుతు న్నాయి. వారం రోజుల నుంచే రాఖీ కొనుగోళ్ల సందడి మొదలైంది. జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్, ఎన్‌టీపీసీ, రామగుండం తదితర పట్టణ, మండల కేంద్రాల్లో రాఖీల కొనుగోళ్లు జోరందుకున్నాయి. శనివారం పండుగ కావడంతో శుక్రవారం గోదావరిఖనిలోని దుకాణాల్లో కొనుగోళ్లతో రాఖీలు, స్వీట్ హౌజ్ షాపులు జనంతో నిండిపోయాయి.



రద్దీగా ఉన్న గోదావరిఖని మార్కెట్

భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయన అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారం, భూభారతి దరఖాస్తుల, ప్రజావాణి దరఖాస్తులు, మీసేవా దరఖాస్తులు, పెండింగ్ భూసేకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సింగరేణి, ఎన్టీపీసీ, జాతీయ రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. నూతన ఆర్వోఆర్ భూభారతి చట్టం నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ చేసి పెట్టుకోవాలని, హైకోర్టు నుంచి అనుమతి రాగానే పరిష్కరించాలని అన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, ఇక నుంచి జిల్లాలో రెవెన్యూ సిబ్బంది సెలవు రోజుల్లో కూడా పని చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు బి గంగయ్య, సురేష్, తహసిల్దార్‌లు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

- గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పెద్దపల్లి కల్చరల్ : రాబోయే 10వ తరగతి పరీ క్షల్లో గురుకుల విద్యాలయాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లోని పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ అధికారులు పాల్గొన్నారు.

- గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

కళ్యాణ్‌నగర్: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న పెండింగ్ పనులను త్వరిగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలోని ఐసీయూ, లేబర్ రూమ్‌లు, జనరల్ వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలోని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు, ఈగలు లేకుండా చూడా లన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. అనం తరం కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరిం టెండెంట్ దయాల్‌సింగ్‌తో సమావేశం నిర్వహించారు.

అగ్నిపథ్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అగ్నిపథ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ నెల 10 నుంచి వారికి ఉచిత గ్రౌండ్ శిక్షణ ఇవ్వనున్నామని, 45 రోజుల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అగ్నిపథ్ అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగు పందెం, ఎస్ఎస్‌సీజీడి అభ్యర్థులకు 5 కిలోమీటర్ల పరుగు పందానికి శిక్షణ ఉంటుందని, ఈ శిక్షణ అనంతరం ఆర్మీ నిర్వహించే ఫిజికల్ టెస్ట్‌లో విజయం సాధించి మిలటరీ, పారామిలిటరీ ఫోర్సెస్‌లోకి వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. మరిన్ని వివరాలకు ఫోన్. 9949725997, 8333044460 నెంబర్‌లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సదాశయ ఫౌండేషన్‌కు శరీరదానం

ఓదెల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కనికిరెడ్డి మల్లేష్ తన శరీరాన్ని సదాశయ ఫౌండేషన్‌కు దానం చేస్తూ శుక్రవారం సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులకు దానపత్రాన్ని అందజేశారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు దాత మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ అభినందన పత్రం, ఐడీ కార్డును అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, కార్యదర్శి శ్రావణ్ కుమార్, మేరుగు బీష్మాచారి, క్యాతం వెంకటేశ్వర్లు, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, క్యాతం మల్లేశం, మేరుగు సారంగం పాల్గొన్నారు.

పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక.. యువతి బలవన్మరణం


సంధ్య మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. చొప్పదండి పట్టణానికి చెందిన వనపర్తి సంధ్య(27) కరీంనగర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తోంది. వారం క్రితం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈనెల 14న వివాహం జరగాల్సి ఉంది. వివాహం కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పెళ్లిపనుల్లో భాగంగా యువతి తల్లిదండ్రులు పెళ్లి కార్డులను పంచేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో సంధ్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కార్డులు పంపిణీ చేసి శుక్రవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి సంధ్య మృతిచెంది ఉంది. తండ్రి కనుకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శ్రీరాములపల్లె రోడ్డు కట్ట వద్ద ఉడుత తిరుపతి(45) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతి ప్రతి రోజు మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ నెల 7వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం శ్రీరాములపల్లె రోడ్ కట్టవద్ద తిరుపతి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమార్తె రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పొలంలో వరి నారు గుంజుతూ కూలీ మృతి

సైదాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన గుంటి అనిల్(35) అనే కూలీ వరి నారు గుంజుతూ పొలంలోనే పడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అనిల్ అదే గ్రామానికి చెందిన గుర్రాల మల్లారెడ్డి అనే రైతు వ్యవసాయ పొలంలో నారు గుంజేందుకు వెళ్లాడు. నారు గుంజుతూ అకస్మాత్తుగా పొలంలో పడి పోయాడు. నాటు వేసేవారు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. దీంతో వెంటనేవారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. తనకుమారుడి మరణంపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కొత్తపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధరకు చెందిన రాజుల యాదయ్య(50) దుర్మరణం చెందగా, గంగాధర వేణు తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాదయ్య, వేణు ద్విచక్రవాహనంపై కరీంనగర్ కేడీసీసీ బ్యాంక్‌కు వచ్చి తిరిగి గంగాధరకు బయల్దేరారు. కొత్తపల్లి శివారులో ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా బైక్‌ను ఢీకొని మరో కారును ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుకకూర్చున్న యాదయ్య రెండువాహనాల మధ్య ఇరుక్కుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. వేణుకు గాయాలయ్యాయి. యాదయ్య మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, గాయపడిన వేణును అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైసాంబమూర్తి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. యాదయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

● రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగ్రాత్రుడిని మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో స్వయంగా ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కాళ్ల పారాణి ఆరక ముందే కానరాని లోకాలకు..



ఈ చిత్రంలో చిరునవ్వులు చిందిస్తోన్న వధువు పేరు ముద్దసాని అఖిల.. చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన ఆమె వివాహం ఈ నెల 6న జగిత్యాల జిల్లా లొత్తునూరుకు చెందిన రాజుతో జరిగింది. కోటి ఆశలతో వివాహ బంధంలోకి వెళ్లిన ఆమెను మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. పీజీ ఎంట్రెన్స్ రాసి భర్తతో కలిసి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓ లారీ వెనక నుంచి ఢీకొంది. రోడ్డుపై పడ్డ అఖిలను ఆ లారీ తొక్కుకుంటూ వెళ్లడంతో ఆమె తల నుజ్జునుజ్జయి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. రాజు కాస్త పక్కకు పడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

● రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి
● భర్తకు గాయాలు
● పీజీ ఎంట్రెన్స్ పరీక్షరాసి వెళుతుండగా ఘటన


అఖిల (ఫైల్)

తిమ్మాపూర్/చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నవ వధువు.. కాళ్ల పారాణి ఆరకముందే కానరాని లోకాలకు వెళ్లి పోయింది. 22ఏళ్లకే నిండు నూరేళ్లు నిండాయి. పెళ్లైన రెండు రోజులు కూడా గడవక ముందే ఆమె రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించింది. ఈ సంఘటన రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని లత-నర్సయ్య దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ముద్దసాని అఖిల (22) వివాహాన్ని ఈ నెల 6న వెల్గటూరు మండలం లొత్తునూర్ గ్రామానికి చెందిన రాజుతో ఘనంగా జరిపించారు. అదే రోజు నూతన వధూవరులు లొత్తునూర్‌కు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం రుక్మాపూర్‌కు వచ్చారు. అఖిలకు పీజీసెట్ ప్రవేశపరీక్ష కోసం ద్విచక్ర వాహనంపై తిమ్మాపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న నవదంపతులు రాజు, అఖిల కింద పడిపోయారు. లారీ వేగంగా అఖిల తలపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాజు స్వల్పగాయాలతో బయట పడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది ప్రమాదానికి కారణ మైన లారీని పట్టుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసు కున్నారు. మృతురాలు అఖిల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అఖిల మృతదేహం

వచ్చాక నల్లపూసలు గుచ్చుకుంటానని చెప్పి వెళ్లి..

పరీక్ష పూర్తయిన వెంటనే రుక్మాపూర్‌కు వచ్చి పెళ్లితంతు కార్యక్రమంలో (నల్లపూసలు గుచ్చుకోవడం) పాల్గొంటామని చెప్పి ఇద్దరూ వెళ్లారు. కూతురు కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు మరణవార్త వినిపించడంతో కుప్పకూలిపోయారు. ఎంతో సంతోషంగా కూతురు అల్లున్ని చూసి మురిసిపోయిన వారి కుటుంబంలో ఒక్కసారిగా విషాదచాయలు అలుముకున్నాయి. కూతురు వివాహాన్ని ఘనంగా జరిపించామన్న సంతోషం ఆ కుటుంబంలో ఒక్కరోజు కూడా నిల్వలేదు. పెళ్లి తంతు కార్యక్రమం అనంతరం తమ్ముడికి రాఖీ కడతానని చెప్పి వెళ్లిన అఖిల తిరిగి రానిలోకాలకు వెళ్లడంతో తమ్ముడు తల్లడిల్లిపోయాడు. అఖిల మృతి రుక్మాపూర్‌తో పాటు లొత్తునూర్‌లో విషాదం నింపింది.

సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు

ఇల్లంతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సావనపెల్లి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోషల్‌మీడియాలో మీడియాలో పోస్టులు పెట్టిన ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఇల్లంతకుంటకు చెందిన సాదుల్ తనని అవమానించే విధంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడని, అదే విధంగా నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త రాజు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మీద అసభ్యకరంగా మార్ఫింగ్ వీడియోలు పెట్టాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోషల్‌మీడియాలో అభ్యంతరకరంగా పోస్టులు ఎవరు పెట్టవద్దన్నారు. ఇతరుల మనోభావాలు కించపర్చేలా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పాఠశాలలో గ్యాస్ సిలిండర్ చోరీ

మల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలోని ప్రాథమికపాఠశాల వంట గది తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్ సిలిండర్‌ను అపహరించుకెళ్లినట్లు బాధిత ఆయా మహ్మద్‌రజియా శుక్రవారం వాపోయింది. మధ్యాహ్నభోజనం అనంతరం గురువారం వంటగదికి తాళంవేసి శుక్ర వారం వచ్చిచూడగా సిలిండర్ లేదన్నారు. మొగిలిపేట గ్రామంలో ఇటీవల వరుసగా సిలిండర్ల చోరీకి గురవుతున్నాయని పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన గ్రామస్థులు కోరుతున్నారు.

ఫేక్ ఫేస్ రికగ్నిషన్ వ్యవహారంలో.. మరో నలుగురు కార్యదర్శులపై వేటు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఫేక్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో మరో నలుగురు పంచాయతీ కార్యదర్శులపై వేటుపడింది. శుక్రవారం జిల్లాలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ, ఒక పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఫేక్‌ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో సంబంధితయాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటోను అప్‌లోడ్ చేసిన బుగ్గారం మండలం చందాయపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్, ఇరవై మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. జూలైలో 24పని దినాలకు గాను 20పనిదినాల వరకు ఫేక్ ఫేస్‌రికగ్నిషన్ అటెండెన్స్‌కు పాల్పడిన నలుగురు కార్యదర్శులపై అధికారులు వేటు వేశారు. బుగ్గారంమండలం గోపులాపూర్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీర్‌పూర్‌మండలం రేకులపల్లి, మల్యాల మండలం రాజారం, ధర్మపురి మండలం నాగారంపంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరితోపాటు మరో17మంది పంచాయతీ కార్యాదర్శులకు వేతనాల్లో కోతవిధిస్తూ ఉత్తర్వులుజారీ అయ్యాయి. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా పంచాయతీఅధికారి మదన్‌మోహన్ తెలిపారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలో కిడ్నాప్ కేసుకు సంబంధించి నిందితుడిని కొత్తపల్లి శివారులో రాజస్థాన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కోసం రాజస్థాన్ పోలీసులు వెతుకుతున్నారు. నిందితుడు హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా మార్గమధ్యలో కొత్తపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం నిందితుడిని రాజస్థాన్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామంలోని మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీస్‌లు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొండపాక గ్రామానికి చెందిన నాగుల రాజు, అవాల గిరిబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారినుంచి రూ.16.500నగదు, 7బైక్‌లు, 8సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కార్లు కిరాయికి పెడతానంటూ నమ్మించి మోసం

● మరొకరి దగ్గర కుదువ పెట్టి లక్షల్లో అప్పు ● నిందితుడి అరెస్టు, నాలుగు కార్లు, సెల్‌ఫోన్ సీజ్


స్వాధీనం చేసుకున్న కార్లు, నిందితుడితో ఏసీపీ రమేష్, అధికారులు

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు లబ్ధిదారులు, ఇతర కారు యజమానుల వద్ద తాను కార్లు అద్దెకు పెట్టించి నెలానెలా కిరాయి ఇప్పిస్తానంటూ నమ్మించి యజమానులకు తెలియకుండా కార్లు కుదువ పెట్టుకున్న గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన మారుపెల్లి ప్రణయ్ భాస్కర్(29) అనేవ్యక్తిని శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు గోదావరిఖని ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన బోడ తిరుపతి, శ్రీనగర్‌కాలనీకి చెందిన కాసర్ల మేఘమాల, ఇల్లంతకుంట మండలం వంతడుపులకు చెందిన సప్పి కుమార్, సప్పి మొగిలిల నుంచి తాను కార్లు అద్దెకు పెట్టిస్తానంటూ మారుపెల్లి ప్రణయ్ భాస్కర్ అనే కారు డ్రైవర్ కొన్ని నెలల క్రితం కార్లను తీసుకెళ్లాడు. ఈ కార్లను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో అద్దెకు పెట్టానంటూ నమ్మించాడు. ఒకటి రెండు నెలలు అద్దె కూడా ఇచ్చాడు. జల్సాలకు అలవాటు పడిన ప్రణయ్ భాస్కర్ ఈ కార్లను కొందరి వద్ద తనఖా పెట్టి కారుకు రెండు మూడు లక్షల చొప్పున రూ.10లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. యజమానులు ఫోన్ చేస్తే స్పందించకుండా హైదరాబాద్‌కు పరారై తప్పించుకుని తిరుగుతున్నాడు. అతనికి సోదరి జూపాక పుష్పలత, సప్తగిరి కాలనీకి చెందిన వనం శ్రీనివాస్ సహకరించారు. బాధితుడు బోడ తిరుపతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు సీఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసుకుని నాలుగు కార్లు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. ఎవరైనా వాహనాలను తనఖా పెట్టుకునే ముందు పూర్తివివరాలను తెలుసుకోవాలన్నారు. ఇలాంటి వాహనాలు తనఖా పెట్టుకుంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రణయ్ భాస్కర్ బాధితులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ఇంద్రసేనారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, సదానందం, ఏలియా, కానిస్టేబుల్ మధుకర్, రమేష్‌లను ఏసీపీ అభినందించారు.

జోరుగా మట్టి దందా

● ప్రభుత్వ భూములే లక్ష్యం
● అడ్డుకున్న గ్రామస్థులు


మట్టి టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్థులు

జూలపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి అక్రమరవాణా జోరుగా సాగుతోంది. మట్టి మాఫియాకు రాజకీయ పలుకుబడి తోడవడంతో అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. మండలంలోని చీమలపేట గ్రామశివారులోని దామెరచెరువుకు అతి సమీపంలో గల గుట్టబోరు మట్టిని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వుతూ టిప్పర్ల ద్వారా నాలుగురోజులుగా మట్టిని ఇతర మండలాలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులు గురువారం మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. మట్టిని తరలిస్తున్న విషయమై మైనింగ్ అధికారులకు శుక్రవారం చేశారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గుట్టబోరు మట్టిని తొలగించడం వల్లా దామెర చెరువులో నీరు నిలువక ఎడారిగా మారే ప్రమాదం ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. అంతే కాకుండా కొందరు మట్టిమాఫియా కేటుగాళ్లు గ్రామంలోని విలువైన ప్రభుత్వ భూముల్లో చెట్లను నరికి వేయడమే కాకుండా చెట్లకర్రలను, మట్టిని అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారని చెపుతున్నారు. మట్టిని తొలగించిన భూమిని సాగుకు వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

ఈ విషయమై జిల్లామైనింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా దామెరచెరువు పక్కన మట్టిని తొలగించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అన్నారు. రోడ్డునిర్మాణాలకు మట్టి తరలిస్తే ఆపనుల నుంచి ప్రభుత్వానికి సొమ్ము జమచేయబడుతుందని పేర్కొన్నారు. అక్కడి ప్రదేశాన్ని పరిశీలించి తదుపరిచర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు రూరల్ మండలంలో కొన్ని రోజులుగా ఇళ్లముందు నిలిపిఉన్న ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్తున్న పడాల దినేష్ అనే నిందితుడిని జగిత్యాలపట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. పట్టణపోలీసులు శుక్రవారం ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా జగిత్యాలరూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన పడాల దినేష్ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. విచారణలో ద్విచక్రవాహనాల దొంగగా గుర్తించామన్నారు. దినేష్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడి వద్ద 9 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సైలు సుప్రియ, రవి కిరణ్, కుమారస్వామి ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కొరడా

● ఇసుక డంప్‌ల సీజ్
● జల్లెడ పడుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు
● 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కోయ శ్రీహర్ష కొరడా ఝుళిపించారు. ఇసుక మాఫియా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై స్పందించిన కలెక్టర్ రెవెన్యూ, పోలీస్, మైనింగ్ విభాగాల అధికారులతో తనిఖీ చేయించారు. వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. రామగుండం అర్బన్ పరిధిలోని పాములపేట, మేడిపల్లి ఇసుక రీచ్‌లను మూసివేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రామగుండం మండల పరిధిలోని ఎఫ్‌సీఐ, సంజయ్‌గాంధీనగర్, గోదావరిఖని సప్తగిరికాలనీ, జనగామలో ఇసుకరీచ్‌లను సీజ్‌చేశారు. 190ట్రాక్టర్ ట్రిప్పులను స్వాధీనం చేసుకున్నారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బెంద్రం రాజిరెడ్డి, సప్తగిరికాలనీకి చెందిన గుంపుల ఓదెలు, మరికొంత మందిపై 303/2బీఎన్ఎస్, 21ఎంఎండీఏఆర్‌ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం అర్బన్ పరిధిలోని ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు విస్తృత తనిఖీలు జరిపారు. ఏసీపీ రమేష్ సారథ్యం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు రమేష్, భూమేష్, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, ఎన్‌టీపీసీ ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పలు ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. మూసివేసిన పాములపేట, మేడిపల్లి క్వారీలకు ట్రాక్టర్లు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు కందకాలు తీశారు. శుక్రవారం ఎన్‌టీపీసీ పీటీఎస్ సమీపంలోని ఇసుక డంప్‌ను సీజ్‌చేశామని, అలాగే జనగామలో మరో డంప్‌ను సీజ్ చేసినట్టు తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ పేర్కొన్నారు. రామగుండం మండల పరిధిలోని ఇసుక రీచ్‌లను నిషేధించామని, ఇక నుంచి ఎవరైనా గోదావరినదిలోకి ట్రాక్టర్లను దించి ఇసుకను తీసుకువచ్చినా, డంప్ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

● దూషించినందుకే తలపై మోది హత్య



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన మెన్నేని ప్రేమలత అనే వృద్ధురాలి హత్య కేసులో నిందితుడైన నాచుపల్లి గ్రామానికి చెందిన సురబి రఘునందన్‌రావును శుక్రవారం అరెస్టుచేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ప్రేమలత రఘునందన్‌రావుకు వరుసకు అత్తమ్మ అవుతుంది. నిందితుడు కనిపించినప్పుడల్లా ప్రేమలత బూతులుతిట్టేది. దీంతో ఆమెపై రఘునందన్‌రావు కోపం పెంచుకున్నాడు. గతసంవత్సరం ప్రేమలతకు, నిందితుడికి మధ్య గొడవ జరగ్గా పెద్దమనుషులు పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పారు. బుధవారం రాత్రి వృద్ధురాలు ఊరినుంచి ఇంటికివెళ్తుండగా రఘునందన్ రావును చూసి దూషించింది. దీంతో ప్రేమలతను అక్కడే ఉన్న కర్రతో తలపై కొట్టి బండరాయితో బాదడంతో ఆమె మృతి చెందింది. అనంతరం మృతురాలి ఇంటి ముందు ఉన్న నీరు లేని బావిలో పడవేశాడు. నిందితుడికోసం గాలించి శుక్రవారం ఉదయం దొంగలమర్రి సమీపంలోపట్టుకొని అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల, ఎస్సై సందీప్ ఉన్నారు.

ఉపాధిహామీలో ఈకేవైసీ విధానం

● అక్రమాల అడ్డుకట్టకు చర్యలు
● ఈ నెల 15 నుంచి అమలు


ముఖచిత్రం ద్వారా హాజరు తీసుకుంటున్న సిబ్బంది

కరీంనగర్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఈకేవైసీ విధానాన్ని అమలులోకి తీసుకురానుంది. దీంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో నకిలీ ఫొటోల అప్‌లోడ్‌కు అడ్డుకట్ట పడనుంది. ఉపాధిహామీ పనుల కోసం వచ్చిన కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు రెండు సార్లు ఫొటోలు తీయాల్సి ఉంటుంది. ముందుగా పనులకు వచ్చిన వెంటనే ఒకసారి, నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటో తీస్తారు. ఈ రెండు ఫొటోల్లో కూలీలు ఒకేలా ఉంటేనే వేతనాలు మంజూరవుతాయి. తేడా ఉంటే వేతనాలు నిలిపివేస్తారు. ఆగస్టు 15 నుంచి ఈ కొత్త విదానానికి శ్రీకారం చుట్టనుండగా ఇప్పటికే క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రస్తుతం ఉపాధిహామీ కూలీ పనుల్లో ఒకరికి బదులు మరొకరు వెళ్లి వేతనాలు పొందినట్లు అనేక సామాజిక తనిఖీల్లో బయటపడింది. కొన్ని సందర్భాల్లో నిధులను రికవరీ కూడా చేశారు. మరికొన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల బంధువులు, క్షేత్ర సహాయకుల కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పనులకు వెళ్లినట్లు హాజరు నమోదు చేస్తున్నారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త యాప్ (ఎన్ఎంఎంఎస్)ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను కూడా కొందరు దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కొత్త విధానానికి చర్యలు చేపట్టారు. గతంలోకూలీలు పని చేయకున్నా క్షేత్ర సహాయకులు ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. ఈ విధానంతో నకిలీ హాజరు అవకాశం ఉండకపోగా వేతనాల చెల్లింపులోనూ పూర్తి పారదర్శకతకు అవకాశం ఉంది.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

మంథనిరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ శివారులోని మల్లయ్య ఇటుక బట్టీలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను తరలించడానికి ప్రయత్నించిన వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. గోదావరినది నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇటుకల బట్టీకి తరలించి అక్కడినుంచి జేసీబీ సహాయంతో రెండు టిప్పర్లలో ఇసుకను జగిత్యాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం రాత్రి పట్టుకున్నట్లు తెలిపారు. జేసీబీ, టిప్పర్లను, ఇసుక డంప్ సీజ్‌చేసి వాసం సతీష్, ముస్కే రాజుకుమార్, ఎర్రం సంతోష్, తనుగుల మహేష్, తన్నీరు మల్లిఖార్జున్, పొట్ల రాజ్‌కుమార్, పొయ్యాల భాస్కర్, పిక్కల మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలలో వృక్ష రక్షా బంధన్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వినూత్నంగా చేపట్టిన వృక్ష రక్షా బంధన్‌కు విద్యార్థినుల నుంచి స్పందన లభించింది. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంగా పని చేసిన ప్రమోద ఆలోచనలతో 16 సంవత్స రాలుగా కార్యక్రమం కొనసాగుతోంది. నీతూకుమారి కలెక్టర్‌గా ఉన్న రోజుల్లో ఆమె ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమోద మాట్లాడుతూ వృక్షాన్ని అన్నదమ్ములుగా భావించి రాఖీ కట్టి రక్షిస్తే నీడను, ఆక్సిజన్, ఆహారాన్ని అందిస్తుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు.

చెట్లకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో సందడిగా మారింది. భక్తులు ప్రవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకు న్న భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనడంతో బాంబ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ప్రాంగణంలో, ఆవరణతో పాటు పలు విభా గాల్లో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళలు కుంకుమ పూజలు

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడా కావడంతో అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయాల్లో ఉపావాస దీక్షతో ఉన్న మహిళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మద్వాచారి రాధికాపవన్ అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగ శాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా, విజయ్ లక్ష్మీ హవనం నిర్వహించారు. అనేక మంది భక్తులు అమ్మవారలతో పాటు లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ పాల్గొన్నారు.



గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ఆదివాసీ జీవన చిత్రాలు

- ఫొటోగ్రఫీలో సిగ్మా శేఖర్ అంతర్జాతీయ ఖ్యాతి
- వెయ్యికు పైగా అవార్డులు.. 100 అంతర్జాతీయ అవార్డులు..
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం







(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అడవితోనే జీవనం, ప్రత్యేకమైన వస్త్రధారణ, అటవీ సంపద, పోడు వ్యవసాయం జీవనాధారంగా మానవ జాతికి అనవాళ్లుగా ఆదివాసీలు, గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అమాయకత్వమే వారి అభరణం.. మూగ జీవాలు వారి నేస్తాలుగా ఇంకా అనేక ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక జీవనం సాగిస్తున్నారు. అడవుల్లో వాగులు, కొండలు, పచ్చని ప్రకృతి ఒడిలో సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను వీడకుండా జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనుల బతుకు చిత్రాలను తన కెమెరాలో బంధించిన సిరి సిల్లకు చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్‌పై శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



ఆదివాసీ, గిరిజనుల బతుకు చిత్రాలు..

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివాసీ, గిరిజనుల జీవన శైలిని, వారి బతుకు చిత్రాలను కెమెరాలో బంధిస్తూ ఫొటోగ్రఫీ రంగంలో శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నారు. సిరిసిల్లలో సిగ్మా ఫొటోస్టూడియోతో ఛాయాచిత్ర రంగంలో అడుగుపెట్టిన మేర్గ శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను అందుకోవడంతోపాటు పలు దేశాల్లో ఫొటోప్రదర్శనలు నిర్వహించారు. సిగ్మా పేరే శేఖర్‌కు సిరిసిల్లలో ఇంటి పేరుగా మారిపోయింది.

ఇప్పుడు సిగ్మా అకాడమి స్థాపించి ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇస్తూ వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నారు. ఫొటోగ్రఫీ రంగంలో 1992 నుంచి 2024 వరకు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. 1000కి పైగా అవార్డులు, 100 అంతర్జాతీయ పురస్కారాలను, 300 మెరిట్ సర్టిఫికెట్‌లను అందుకున్నారు. సిగ్మా ద్వారా 200 పైగా వర్క్ షాప్‌లు నిర్వహించారు. ఢిల్లీ నగరంతో పాటు అనేక ప్రాంతాల్లో శేఖర్ విభిన్నంగా తీసిన దాదాపు 1650 ఫొటోలతో ఎగ్జిబిషన్లు నిర్వహించారు.



శేఖర్ (ఫైల్)

పత్తిలో కలుపు మందు పిచికారికి ప్రత్యేక ఏర్పాట్లు

పాలకుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల గ్రామంలోని రైతులు పత్తిలో కలుపు మందు పిచికారి చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విధానంతో పత్తి మొక్కలపై కలుపు మందు పడకుండా కలుపు మొక్కల నివారణ జరుగుతుందని ఏఈవో శశిధర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రత్యేక పరికరం వాడు తున్న రైతులతో మాట్లాడుతూ పత్తి విత్తిన 20 నుంచి 60 రోజుల వరకు చేనులో కలుపు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాగళ్లతో గాని, కూలీల సహాయంతోగాని 60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకున్నట్లయితే పత్తి ఏపుగా పెరుగుతందన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరికరంతో పత్తి మొక్కలపై గడ్డి మందు పడకుండా పిచికారీ చేసుకోవచ్చన్నారు. కలుపు ఉండడం వల్ల పత్తి మొక్కలకు వేసిన రసాయన ఎరువులు ఆ మొక్కలకే పోతాయన్నారు. రైతులు సట్ల కనుకయ్య, సముద్రాల పోచయ్య, మొం డయ్య, సాయిలు, బాదావత్ తిరుపతి పాల్గొన్నారు.



ప్రత్యేక పరికరంపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శశిధర్

సిట్ విచారణకు హాజరైన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు సిట్ విచారణకు హాజరవుతున్న పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు

భగత్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ విచారణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ నిమిత్తం పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాప్ చేయడం దుర్మార్గమన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి సాగదీస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిపించే విడిచి పేట్టేది లేదని స్పష్టం చేశారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు కొత్తపల్లి ఆల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం ముగిసాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. టీంఈవెంట్ అండర్-14 విభాగంలో వీపీఎస్ పబ్లిక్ స్కూలు (విజయవాడ) ప్రథమ స్థానం, టైం స్కూలు(రంగారెడ్డి) ద్వితీయ స్థానం సాధించాయి. అండర్-17 విభాగంలో శ్రీప్రకాష్ స్కూల్ (తూర్పు గోదావరి) ప్రథమస్థానం, సర్ సీఆర్ స్కూల్(పెద్దాపురం, పశ్చిమ గోదావరి) ద్వితీయ స్థానం, అండర్-19 విభాగంలో శ్రీప్రకాశ్ స్కూలు (తూర్పుగోదావరి)ప్రథమస్థానం, సర్ సీఆర్ రెడ్డి స్కూల్ (పెద్దాపురం, పశ్చిమగోదావరి) ద్వితీయ స్థానాలు సాధించాయి.

వ్యక్తిగత విభాగంలో అండర్-14లో శీలం మనస్వి ప్రథమ స్థానం, అండర్-17 విభాగంలో ఎం. శాంతిజ్యోతి ప్రథమ, అండర్-19 విభాగంలో ఎం.దర్శిక ప్రథమ స్థానం సాధించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక అభి వృద్ధి లభిస్తుందన్నారు. క్రీడలు ఒత్తిడి నుంచి తట్టుకునే శక్తిని అందిస్తాయన్నారు. క్రీడల్లో రాణించినవారు, చదువులోనూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల పరిశీలకులు పద్మారావు, చీఫ్ రెఫరీ శంకర్, అసోసియేట్ రెఫరీ రాంచంద్రారావు, అంపైర్లు బాబు రావు, ఒతినేలు, ఎండీ గౌస్, రామ్మూర్తి, రవి, గంగారాం, పాఠశాలల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



సీబీఎస్ఈ టేబుల్ టెన్నిస్ పోటీల విజేతలతో అతిథులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.

సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలలో గెలు పొందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎస్.మనస్వి, రిద్దిటోరో, కె.నైనా, వంశిక, అండర్-17 విభాగంలో జి.వర్షిక, ఎస్. తనిష్క, ఎం.దాస్, మిద్ది శాంతి జ్యోతి, అండర్-19 విభాగంలో టి.సాయిసుదీక్ష, కె. రిషికాతులసి, ఎం. మాండవ లినేషియా, ఎం.దర్శిక ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

సమసమాజ స్థాపనకు గద్దర్ అలుపెరగని కృషి

తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

హుజూరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు ప్రజా యుద్ధనౌక గద్దర్ అలు పెరగని కృషిచేశారని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో శనిగరం బాబ్జీ ఆధ్వర్యంలో గద్దర్ ద్వితీయ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి సిటీ సెంట్రల్‌హాల్ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ప్రజల విముక్తి కోసం తూటాను మోసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. గద్దర్ ఆశ, ఆశయం సమ సమాజ నిర్మాణం స్వేచ్ఛ, సమానత్వం పోరా టాలు చేశారన్నారు. ఉస్మానియా యూని వర్సిటీ విద్యార్థి నుంచి జన నాట్య మండలి సాంస్కృతిక సేనానిగా పాటను ఆయుధంగా ఎక్కుపెట్టి ప్రజా ఉద్యమాలు జరిపారన్నారు. కారంచేడు హత్యాకాండ జరిగిన ప్పుడు దళితులకు ధిక్కారం నూరిపోశారన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

జీవితమంతా ప్రజా పోరాటాల్లో గడిపి న గద్దర్‌ను 75ఏళ్ల వయసు వరకు 32 పోలీసు కేసులు వెంటాడా యన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని గద్దర్ తన పాటా, ఆటలతో ఊర్రూతలూగించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిత్యం ప్రజాపోరా టాలతో ముందుకు సాగిన ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభలో కళాకారులు పాడిన పాటలు ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఆవునూరి సమ్మయ్య, ముక్కెర రాజు, జీడీ సార య్య, బండ శ్రీనివాస్, మురళీ మధు, రాములు, తిరుపతయ్య, కళాకారులు, కవులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం..

వీర్నపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంటతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని వీర్నపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి ఫజిల్ అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో రైతు పెంచ్యాల నర్సింగం ఆయిల్‌పామ్ పంట మొద టి దిగుబడి రావడంతో అధికారులు, రైతులు శుక్రవారం పరిశీ లించారు. జిల్లాలోనే మొదటిసారి ఆయిల్‌పామ్ పంట కోతకు వచ్చిం దన్నారు. మొద టిదశలో సుమారు 4 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చినట్లు ఏఈవో తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక ఎదుగుదల అధికమవుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రస్తుతం మార్కెట్లో టన్నుకు రూ.18,500 ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి పవన్, ఏఎంసీ డైరెక్టర్లు చంద్రమౌళి, నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,062 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం 5,062 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో కాకతీయ కాలువకు 2,350 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 113 క్యూసెక్కులు, అల్లీసాగర్ ఎత్తిపోతల పథకానికి 240 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 112 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 225 క్యూసెక్కులు, వరద కాలువకు 2,250 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 462 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వ్యయం అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.859 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 4.343 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

నోరూరిస్తున్న పిండి వంటలు..

వరుస పండుగలు... శుభకార్యాలు

తయారీదారులకు పెరిగిన గిరాకీ





అమ్మకానికి సిద్ధంగా ఉన్న గారెలు, మురుకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఈ ఆగస్టు మాసంలో వరుసగా పండుగలతో పాటు (వరలక్ష్మీవ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, వినాయకచవితి) శుభకార్యాల జోరు ఊపందుకుంది. ఇందుకు ఎన్ని పదార్థాలు వడ్డించినా పిండి వంటలు రుచి చూపాల్సిందే! పిల్లలు, పెద్దలు సైతం తినుబండారాలకు దాసులే! పిల్లలకైతే స్నాక్స్ రూపంలో కూడా ఉపయోగపడుతాయి. ఇతర ప్రదేశాలకు టూర్ వెళ్లే వారికి కూడా బాగా పనికి వస్తాయి. దీనికి జిల్లా వాసులు శ్రమ లేకుండా పలు షాపుల్లో, హోం ఫుడ్ సెంటర్లలో తయారైన పిండి వంటలను, పలు పచ్చళ్లను ఆశ్రయిస్తున్నారు. అందు బాటులో ధరలకే వంటకాలను అందిస్తుండటంతో అటు తయారీ దారులకు గిరాకీ పెరుగుతోంది. చేయి తిరిగిన మనుషులతో శుభ్రమైన పదార్థాలు ఏ రోజుకారోజు తయారీ చేసి విక్రయిస్తున్నారు. మరో వైపు విదేశాల్లో ఉన్న తమ వారికి ప్యాకింగ్ చేసి కూడా పంపుతు న్నారు. సుమారు 50కి పైగా తీయని, కారపు వంట కాలు అమ్ముతుండగా వినియోగదారులు కిలోల చొప్పున తీసుకుంటున్నారు. చిప్స్ మొదలు అప్పాల వరకు, గవ్వలు మొదలు లడ్డూల వరకు వివిధ సైజల్లో అమ్ముతున్నారు. వెరైటీని బట్టి కిలోకు ఒక్కో పిండి వంటకం కనిష్ట ధర రూ.280 నుంచి గరిష్ట ధర రూ.350 వరకు పలుకుతున్నాయి.

ఉధృతంగా పల్వంచ వాగు

గంభీరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వస్తోంది. మానేరు జలాశయం నీటి మట్టం రోజు రోజుకు పెరుగుతోంది. శుక్రవారం నాటికి ఎగువ మానేరు నీటి మట్టం 23 ఫీట్లకు చేరింది. మానేరు పూర్తిగా నిండేందుకు మరో 8 ఫీట్ల నీరు కావల్సింది ఉంది. మానేరు నిండుతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.



రైతు బీమా కొనసాగేనా..

(5వ పేజీ తరువాయి)

మెంట్లు అందించిన 363 మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. 345 మంది రైతు కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున 17 కోట్ల 25 లక్షల రూపాయలు ఎల్ఐసీ సంస్థ చెల్లించింది. ఇంకా కొంత మంది రైతులకు చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ప్రీమియం చెల్లించే విషయమై ఊసెత్తడం లేదు. ఈ ఏడాది కాలంలో పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన దాదాపు 5 వేల మంది రైతులు కొత్తగా పథకంలో చేరడానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖాధికారులతో మాట్లాడితే, ప్రభుత్వం నుంచి రైతు బీమా కోసం కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని ఎలాంటి ఆదేశాలు రాలేదని, రెన్యూవల్‌కు ఇంకా ఐదు రోజులు గడువు ఉందని చెబుతున్నారు. అప్పటి వరకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు.

పేరు సవరించిన రెవెన్యూ అధికారులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన గోస్కుల సాయికుమార్ తన పేరు రెవెన్యూ రికార్డుల్లో గోస్కుల రాయమల్లుగా తప్పుగా నమోదయ్యింది. దీని కోసం పేరు మార్పిడి చేయాలని భూభారతిలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయంపై పరిశీలించిన తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు రెవెన్యూ రికార్డుల్లో గోస్కుల రాయమల్లుగా తప్పుగా ఉన్న పేరును సరి చేస్తూ గోస్కుల సాయికుమార్‌గా మార్చి శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో రైతు సాయికుమార్‌కు తన పట్టా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూములుగా రియల్ వెంచర్లు

● తగ్గిన భూముల క్రయవిక్రయాలు ● అప్పుల భారంతో ఐపీ వైపు రియల్ వ్యాపారులు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): భూముల క్రయవిక్రయాలు లేక రియల్ వ్యాపారులు అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నారు. దిక్కులేని పరిస్థితుల్లో ఐపీ పెట్టి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు వెంచర్లుగా మార్చిన సాగు భూముల్లో కొన్ని చోట్ల మళ్లీ సాగు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాగా మారడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉపందుకుంది. చుట్టు పక్కల గ్రామాలు, పక్క జిల్లాల నుంచి ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశారు. జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, రామగిరి, గోదావరిఖని, సుల్తానాబాద్‌లో రియల్ వ్యాపారం జోరుగా సాగింది. వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్లుగా మార్చి ప్లాట్లు విక్రయించారు. ఒక వెంచర్ పూర్తి కాకుండానే మరో వెంచర్ కోసం ముందస్తుగా భూముల కొనుగోలు చేపట్టారు. పెద్దపల్లి జిల్లాలో సుమారు 70 నుంచి 80 వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేయగా వీరిపై సుమారుగా 8 వందల మంది పైగా మధ్య వర్తులు ఉపాధి పొందేవారు. రెండు, మూడేళ్లుగా ప్లాట్లు అమ్ముడుపోక పోవడంతో అప్పులు తెచ్చి వెంచర్లు వేసిన వారు, భూమి కొనుగోలుకు బయానా ఇచ్చిన వారు వాయిదా డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కుప్పలుగా మారడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో కోర్టులను ఆశ్రయించి ఐపీలు పెడుతున్నారు. కొందరు వెంచర్లను చదును చేసి మళ్లీ వ్యవసాయ భూములుగా మార్చుతున్నారు. అక్కడక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు. భూ యజమాని తన వాయిదాలు చెల్లించనిది రిజిస్ట్రేషన్‌కు రానని మొండికేస్తున్నారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్లు, కోర్టులు ఆశ్రయించడంతో కేసులను ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని కోర్టుల్లో పదుల సంఖ్యలో ఐపీ కేసులు నమోదవుతున్నాయి. ఇందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు, చిట్టీలు, వివిధ ఆర్థిక లావాదేవీలు చేసిన వారు ఉన్నారు. కొందరు ఊరు వదిలి వెళ్లి వేరే చోట ఉంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



పొలాలుగా మారిన వెంచర్ స్థలం

మహిళా కార్మికురాలిని వేధించిన సూపర్‌వైజర్ తొలగింపు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహిళా కార్మికురాలిని వేధించిన సూపర్‌వైజర్ తాజ్‌ను తొలగించినట్టు కాంట్రాక్టర్ హన్మంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో ఎవరైనా మహిళా కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని, ఎవరైనా వేధించినట్టు దృష్టికి వస్తే తమకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

12న మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు

ఓదెల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ నెల 12న హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సదయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే లెక్కింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా వరలక్ష్మీ పూజలు



పూజలు చేస్తున్న విద్యార్థినిలు



వరలక్ష్మీ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతోపాటు పలు దేవాలయాల్లో శ్రావణ మాసంలో వచ్చే మూడవ శుక్రవారం వరలక్ష్మి, లక్ష్మీదేవి వ్రతాలు మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో పలువురు అధ్యాపకులు, విద్యార్థినిలు ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైస్ ప్రిన్సిపాల్ రామచందర్, అధ్యాపకులు సరితారెడ్డి, నిర్మల, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ : వరలక్ష్మీ శుక్రవారం పురస్కరించుకుని మహిళలు తమ నివాసాలలలో వరలక్ష్మీ వ్రతాలను జరుపుకున్నారు. కనుకుల శివాలయంలో ఊటూరి శంకరశర్మ ఆధ్వర్యంలో, సుల్తానాబాద్ రాజమాత ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు.

● కోల్‌సిటీటౌన్: గోదావరిఖనిలో వరలక్ష్మీవ్రతం వేడుకలు శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. స్థానిక కోదండ రామాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీవ్రతాల్లో వందలాది మంది మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యంజీ ముఖ్యఅతిథిగా హాజరై వ్రతం గొప్పదనాన్ని తెలిపారు.

● ఎలిగేడు : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు మహిళలు పెద్ద ఎత్తున చేపట్టారు. ప్రతియేటా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే వరలక్ష్మి వ్రతం, లక్ష్మీదేవి వ్రతం వారి ఇళ్లలోపాటు దేవాలయాల్లో కూడా నిర్వహించారు.

● ఓదెల: అత్యంత శ్రేష్టమైన శ్రావణ శుక్రవారం మండలంలో శ్రీవరలక్ష్మి వ్రత సంకల్పాలు భక్తిశ్రద్ధలతో మహిళలు నిర్వహించారు. ఓదెల దేవాలయం, పొత్కపల్లిలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం, మహాలింగేశ్వర స్వామి ఆలయంతోపాటు పలు గ్రామాల్లోని క్షేత్రాల్లో మహిళలు పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వశిష్ట పాఠశాలలో ప్రిన్సిపాల్ మ్యాడ గోని కిషన్ ఆధ్వర్యంలో వ్రత సంకల్పాన్ని పురోహితుడు సందీప్ నిర్వహించారు. అలాగే మండలంలోని గ్రామాల్లో ప్రతి ఇంటిలో మహిళలు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

● మంథని రూరల్ : మండలంలోని పలు గ్రామలలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంజపడుగు, ఆరేంద, ఉప్పట్ల, విలోచవరం, నాగరం, వెంకటాపూర్, ఎగ్లాసుపూర్, రచ్చపల్లి గ్రామలలోని ఆలయలలో భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం మంథని గోదావరి నదిలో పుణ్యా స్నానాలు అచరించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

కమాన్‌పూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా అన్వర్ నూతనంగా నియామకం కావడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన టీపీసీసీ కార్యదర్శి శ్రీనుబాబుకు స్థానిక నాయకులు, మండల అధ్యక్షుడు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోని అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందుకుసాగాలన్నారు.

ప్రజల కోసం పని చేసే వారికి గుర్తింపు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 08 (ఆంధ్రజ్యోతి) ప్రజల హక్కుల పరిరక్షణ, సమస్యలపై పోరాడి వారి కోసం పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో పెద్దపల్లి పట్టణానికి చెందిన మాదిగ శక్తి వ్యవస్థపాక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని జన్మదిన వేడుకలు మాజీ మంత్రి సమక్షంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సురేందర్ సన్నిని ఆశీర్వదిస్తూ ఘనంగా సన్మానించారు. దళిత సంఘాల సీనియర్ నాయకులు ముంజగళ్ల విజయ్ కుమార్, ఇటుక రాజు, నర్సింగ రావు తదితరులు ఉన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు



గాయత్రి విద్యానికేతన్‌లో..



ఖని కృష్ణవేణి పాఠశాలలో వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి హాజరై రాఖీ పౌర్ణమి, రక్షాబంధన్ ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : పాలకుర్తి మండలం జీడినగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాల,పుట్నూర్ గ్రామంలోని గ్లోబల్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు ఇస్మాయిల్, బుర్రం సత్యంగౌడ్‌లు మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్,గండు సతీష్ కుమార్, ఇన్‌చార్జి శ్రీరాముల లావణ్య , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. అన్నా చెల్లెళ్ల బంధానికి ప్రతీక రాఖీ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమణి, ఉపాధ్యాయులు భూలక్ష్మి, గౌతమి, నాగరాణి, రాణి, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.



జీడినగర్ యూనివర్సల్ పాఠశాలలో.



ఆపిల్ కిడ్స్ పాఠశాలలో

బీజేవైఎం ఆధ్వర్యంలో..

ఓదెల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి వశిష్ట ఇంగ్లీష్ మీడియంలో శ్రావణ శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్, సిరిసేటి వీరస్వామి, పుప్పాల రమేష్, బండారి చిన్నసమ్మయ్య, రెడ్డి శంకర్, సతీష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలంలోని సెంటినరీ కాలనీలోని వాణి, కృష్ణవేణి టాలెంట్ పాఠశాలల్లో విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను ముందస్తుగా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొండు లక్ష్మన్, నాయకులు తొట్లరాజు,సాగర్, నాంసాని మహేష్, పులి రాజు, కందుల రమేశ్, సందీప్, రసమల్ల ఆదిత్య, కలికోట రాము, పాఠశాలల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారుడు సారంగపాణికి ఘన నివాళి

సుల్తానాబాద్, ఆగస్టు 8: (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి ప్రముఖ ఖోఖో క్రీడాకారుడు సారంగపాణికి సుల్తానాబాద్‌లో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అనేక పర్యాయాలు జాతీయ స్థాయిలో ఖోఖో క్రీడా పోటీలలో పాల్గొని తెలంగాణకు ఎన్నో విజయాలు అందించిన ఉత్తమ క్రీడాకారుడని స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి అన్నారు. ఎ కార్యక్రమంలో కోచ్, అంతర్జాతీయ క్రీడాకారుడు గెల్లు మధూకర్, వ్యాయామ ఉపాధ్యాయులు అంతటి శంకరయ్య, భైరగోని రవీందర్ గౌడ్,ఆలేటి సంపత్ కుమార్, తాండ్ర ప్రణయ్, కల్వల వెంకటేశ్, ఇక్బాల్, అజ్జూ, రాజేష్, అంజన్ కుమార్, అమిరిశెట్టి రాకేష్, దొడ్ల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత మాదన నారాయణకు ఘన నివాళి

గోదావరిఖని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ చైర్మన్, ఏఐటీయూసీ మాజీ ఉప ప్రధాన కార్యదర్శి దివంగత మాదన నారాయణ ఐదవ వర్థంతి సందర్భంగా శుక్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన సభలో నారాయణ చిత్ర పటానికి ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ సీపీఐ, ఏఐటీయూసీకి, సింగరేణి కార్మిక వర్గానికి చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు భాస్కర్‌రావు భవన్‌లో ఉన్న మీటింగ్ హాల్‌కు మాదన నారాయణ హాల్ అని నామకరణం చేశారు. ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, కన్నం లక్ష్మీనారాయణ, ఎస్ వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, సయ్యద్ సోహేల్, ఎంఎ గౌస్, ఎజ్జ రాజయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రాఖీ వేడుకలు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకల సందర్భంగా శుక్రవారం ఆయ ప్రభుత్వ కార్యాలయాల్లో పలువురు మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నిహారిక తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు,ఉద్యోగులకు రాఖీ కట్టారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ఓదెల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థులు వినియోగించుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మూల ప్రేంసాగర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొలనూర్ గ్రామంలో ఆయనతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్లను సందర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాని వారు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని, వారికి కూడా త్వరలో వస్తాయని తెలపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిసేటి రాహుల్, మాజీ సర్పంచ్ బొంగోని రాజయ్య గౌడ్, పాకాల కర్ణాకర్ రెడ్డి, కుంచం మల్లయ్యతోపాటు పలువురు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పని చేయని లిఫ్ట్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గత 20రోజులుగా లిఫ్ట్ పని చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలోని రెండవ అంతస్థుకు వెళ్లాలంటే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 20రోజులుగా లిఫ్ట్ పని చేయకపోవడంతో దాని మరమ్మతులను పట్టించుకోవడం లేదు.



వీల్ చైర్‌పై రోగిని తీసుకెళుతున్న సిబ్బంది

బీసీ నినాదం కాంగ్రెస్ ఆడుతున్న నాటకం

ముత్తారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీసీ నినాదం ఒక డ్రామా అని కేవలం కమీషన్లకోసం ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి అన్నారు. కేవలం ఏదో ఒక సాకుతో కాలయాపన చేస్తూ ప్రభుత్వాన్ని ముందుకు నడిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డ్రామనే బీసీ నినాదం అని అన్నారు. నిజంగానే బీసీ బిడ్డలపై ప్రేముంటే పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మాజీ సింగిల్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, మాజీ వైస్ఎంపీపీ రవీందర్‌రావు, రైతుబంధు కన్వీనర్ అత్తే చంద్రమౌళి, నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన పద్మశాలి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

కమాన్‌పూర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పలువురు చేనేత కార్మికులను సన్మానించుకున్నారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన పలువురు ఉమ్మడి కమాన్‌పూర్, రామగిరి మండల పద్మశాలి విద్యార్థులను సన్మానించి, ప్రశంసా పత్రాలు అందించారు. అలాగే రొంపికుంట గ్రామంలో పద్మశాలి భవనంలో గత ఐదేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు,మాజీ సర్పంచ్ కుందారపు బాపు అధ్యక్షతన జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కొలిపాక సత్తయ్య, గుండేటి రాజేష్, ప్రముఖ కవి, గాయకులు, జిల్లా పద్మశాలి సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి అందె సదానందంతోపాటు పలువురు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. తమ కులదైవమైన మార్కండేయ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి, పూజలు చేశారు. అనంతరం పద్మశాలీలు కుందారపు చంద్రయ్య, శంకరయ్య, రాజయ్య, నర్సయ్య, నామని రాయలింగు, బంగారి గట్టయ్యలను సన్మానించుకున్నారు. దీంతోపాటు పాత్రికేయులు మాటేటి కుమార్ వొడ్నాల ఇందు, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ఫొటోగ్రాఫర్ కొండి అనిల్, కుందారపు శేఖర్‌లను సన్మానించారు. ఉమ్మడి కమాన్‌పూర్ మండల మాజీ జడ్పీటీసీ, మాజీ సర్పంచ్ ఎల్లె శశిరేఖ రామ్మూర్తి, మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య పాల్గొన్నారు.



సింగరేణి వాస్తవ లాభాలు ప్రకటించాలి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయు నేతలు

రామగిరి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటిస్తూ 35 శాతం కల్పించాలని కోరుతూ శుక్రవారం ఓసిపి-2 ప్రాజెక్టు అధికారి వెంకటరమణకు సీఐటీయు నాయకుడు కొంరయ్య వినతిపత్రం అందజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వాస్తవ లాభాలు ప్రకటించడం లేదని వినతిలో పేర్కొన్నారు. మేలోనే ఇచ్చి ఆనవాయితీగా వస్తున్న వాటాపై కార్మిక కుటుంబాలు ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. పిల్లల స్కూల్, కాలేజీ ఫీజులు చెల్లింపులకు అవస్థలు పడుతున్నారని పేర్కోన్నారు. గత సంవత్సరం లాభాల లెక్కింపులో పారదర్శకత లోపించిందని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సింగరేణి వాస్తవ లాభాల్లో పారదర్శకతను పాటించి 35 శాతం లాభాల వాటాను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొమ్మటి కొమురయ్య, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, రమణారెడ్డి, మల్లికార్జున్, కుమార్ ఉన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్‌జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో మడ్డి ఎల్లాగౌడ్, ఎంఏ గౌస్‌లు శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆర్‌జీ-1లో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల ప్రధాన సమస్యలు పరిష్కారం కాక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ప్రతినెల 1వ తేదీ నుంచి 7వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలని, ప్రతి సెక్యూరిటీ గార్డుకు నెలకు 26మస్టర్లు ఇవ్వాలని, పోస్టింగ్‌ల దగ్గర సరైన సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. యూనిఫాం బ్లూ కలర్‌ను తొలగించి కాకి కలర్‌ను ఇప్పించి సింగరేణి కంపెనీ హుందాతనాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎంపీఎఫ్ చిట్టీలు గత ఏడు సంవత్సరాలుగా ఇవ్వడం లేదని, ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై సెక్యూరిటీ గార్డ్‌ల కాంట్రాక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని జీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సోహెల్ పాల్గొన్నారు.

గనుల భూగర్భ జలాల పరిశీలన

గోదావరిఖని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే11 ఇంక్లైన్, పెద్దంపేట షాఫ్ట్ భూగర్భ జలాలను పెద్దపల్లి జిల్లా భూగర్భజల శాఖ హైడ్రాలజిస్ట్ శుక్రవారం పరిశీలించారు. మొదట గని ఏజెంట్ కార్యాలయం నందు గనిలోని వివిధ సీమ్‌ల ప్యానెల్, గని ప్లాన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి ఆంజనేయప్రసాద్, గని ఏజెంట్ ఇ. శ్రీనివాస్, గని పర్యావరణ అధికారి ఎస్‌కే వసీంఅక్రం, పిట్ ఇంజనీర్ ఈ రాకేష్ పాల్గొన్నారు.



గనిలోకి దిగుతున్న జిల్లా భూగర్భజల శాఖ అధికారులు

రాఖీ పండుగకు సెలవు దినంగా ప్రకటించండి

గోదావరిఖని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ నిర్వహించే ఈ నెల 9న సింగరేణి సంస్థలో వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రులకు శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి వినతిపత్రం అందజేశారు. గాంధీ జయంతి, దసరా పండుగలు ఒకే రోజున రావడం వలన కార్మికులు ఆర్థికంగా నష్టపోతారని, అదేవిధంగా కంపెనీ ఉత్పత్తికి కూడా అంతరాయం కలుగుతుందని, కోల్ ఇండియా యజమాన్యం రాఖీ దినోత్సవాన్ని వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించినందున సింగరేణిలో కూడా అమలు పరచాలని టీబీజీకేఎస్ నాయకులు కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు